క్లుప్తంగా

అనుమతులు లేని లే అవుట్లతో అప్రమత్తం

కొత్తపల్లి: పంచాయతీ అనుమతులు లేకుండా లే అవుట్‌లు వేస్తే నిబంధల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అనుమతిలేని లే అవుట్ వద్ద పంచాయతీ సిబ్బంది నోటీసులు జారీ చేసి బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటువంటి అనుమతులు లేని లే అవుట్లలో స్థలాలు కొన్నవారు ఇళ్ల నిర్మాణానికి అదనంగా పంచాయతీలకు రుసుం చెల్లించాల్సి వస్తుందన్నారు. పంచాయతీ ద్వారా ఎటువంటి సౌకర్యాలు కల్పించబడవు. స్థలాలు కొనుగోలు చేసే వారు అన్ని అనుమతులను పరిశీలించుకోవాలి. ముఖ్యంగా ఇంటి, కుళాయి పన్నులను చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

3, 4 తేదీల్లో రక్షణ సువార్త స్వస్థత సభలు

పెద్దాపురం: ప్రపంచ శాంతి, ప్రజా శ్రేయస్సుకై వచ్చే నెల 3, 4 తేదీల్లో పిఠాపురం మండలం విరవ గ్రామంలో రక్షణ సువార్త స్వస్థత సభలు నిర్వహించనున్నట్లు క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరాల వ్యవస్థాపకులు నంగిన సత్యానందం, సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్ తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేస్తూ 3వ తేదీన జరిగే స్వస్థత సభలో రెవరెండ్ సంతోష్ చెడ్డి, నాలుగో తేదీన రెవరెండ్ సుభాకర్ శాస్త్రి దైవ ప్రసంగాలను అందజేస్తారన్నారు.

సహృదయ క్లబ్ ఏర్పాటు అభినందనీయం


సహృదయ కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న క్లబ్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్

బోట్‌క్లబ్: దివ్యాంగులతో లయన్స్‌క్లబ్ సహృదయ క్లబ్ ఏర్పాటు చేయడం అపూర్వమైనదని క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ శ్రీ శాంతి అన్నారు. స్థానిక టౌన్‌హాల్‌లో ఆదివారం ఈ క్లబ్ ఏర్పాటు చేసి, సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ క్లబ్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన లయన్స్ సంకల్ప్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఇతర సభ్యులు మెట్లా రాధ, బాలాంత్రపు సుచిత్ర అభినందనీయులన్నారు. అనంతరం సహృదయ అధ్యక్షుడిగా పి.సురేష్‌కుమార్ ఇతర కార్యవర్గ సభ్యులుతో క్లబ్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్లు లింగమల్లు కృష్ణమూర్తి, ముంజులూరి విశ్వేశ్వరరావు, వైస్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా నగర సంకీర్తన

బోట్‌క్లబ్: మాఘమాస సంకష్ట హరచతుర్థిని స్థానిక భోగి గణపతి పీఠంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి రమణరాజు ఆధ్వర్యంలో 53 మంది చతుర్థి ఉపాసకులతో ప్రత్యేక పూజలు చేశారు. మంగళ వాయిద్యాలు, పరమేశ్వర నామాలతో నగర సంకీర్తన, సహస్రనామ పారాయణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

రౌతులపూడి: మండలంలోని పి.చామవరంలో ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ ఎంపీటీసీ సభ్యుడు కామిరెడ్డి నాగేశ్వరరావు, పోతల రాజులను ఎంఎంఆర్ ట్రస్టు అధినేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముదినూరి మురళీకృష్ణంరాజు ఆదివారం పరామర్శించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. లచ్చిరెడ్డిపాలెంలో కొండరాజుల బాబు పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనాల్లో ఆయన పాల్గొన్నారు. ఉత్సవ కమిటీకి రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయాణికుడికి బ్యాగ్ అందజేత


లగేజీ బ్యాగ్‌ను ప్రయాణికుడు నాయక్‌కు అందజేస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్యాం త్రినాథరావు

అన్నవరం: రైలులో పోగొట్టుకున్న బ్యాగును బాధితుడి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు వెతికి అతనికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే... ఉద్యోగంలో చేరేందుకు భువనేశ్వర్ నుంచి బెంగళూరుకు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న ఐక్య నాయక్ అనే యువకుడి లగేజీ బ్యాగ్‌ను పొరబాటున పెళ్లి బృందం సభ్యులు అన్నవరంలో తమ లగేజీతో పాటు ప్లాట్‌ఫారం మీద దించేశారు. రైలు అన్నవరం నుంచి కొంత దూరం వెళ్లాక నాయక్ తన లగేజీ బ్యాగ్‌ను చూడగా లేకపోవడంతో తుని జీఆర్‌పీ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఆ బ్యాగ్‌లో సర్టిఫికెట్లు, ఇతర విలువైన డాక్యుమెంట్లు ఉన్నాయని తెలిపాడు. దీంతో ఎస్‌ఐ అన్నవరం జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ శ్యాం త్రినాథరావుకు ఫోన్ చేయగా ఆయన పెళ్లి బృందం లగేజీ తనిఖీ చేసి నాయక్ బ్యాగ్‌ను గుర్తించారు. దానిని బాధితుడికి అందజేశారు.

గతి తప్పితే గోతిలోకే!

- నోళ్లు తెరచిన కల్వర్టులు
- ప్రమాదాల పాలవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


మూడు రోడ్ల కూడలి తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ వద్ద ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు


మఠం సెంటర్‌లో కూల్చివేసిన కల్వర్టు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని ముఖ్య కూడళ్లలో కల్వర్టులు శిథిలమవడంతో పాదచారులు, వాహన చోదకులు తరచూ ప్రమాదాలపాలవుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే తాండవిస్తూ వాహన చోదకులు గాయాలపాలవుతుండగా, వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి.

స్థానిక తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ వద్ద కల్వర్టు శిథిలం కావడంతో ఆ పాఠశాలకు వెళ్లే విద్యార్థులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కల్వర్టు సమీపంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు అనేక మంది కౌన్సిలర్ల నివాసాలు ఉన్నా దీని మరమ్మతులకు ఎవరూ చర్యలు తీసుకోవడం లేదు.

మఠం సెంటర్‌లో సైతం

మఠం సెంటర్‌లో అంబటి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద డ్రైనులో పూడిక పేరుతో సుమరు రెండు నెలల క్రితం కల్వర్టు కూల్చేశారు. తరువాత దానిపై ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. సామర్లకోట–పెద్దాపురం రోడ్డులో రోడ్డు మార్జిన్‌లో కూల్చి వేసిన కల్వర్టుకు రెయిలింగ్ లేకపోవడంతో పెద్దాపురం నుంచి వచ్చే వాహనచోదకులకు ప్రాణాల మీదకు వచ్చే అవకాశం లేకపోలేదు. కల్వర్టు కూల్చిన తరువాత డివైడర్ బోర్డులు ఏర్పాటు చేశారు కానీ వాటిని తొలగించకపోవడంతో అవి ప్రమాదకరంగా తయారయ్యాయి. ఈ ప్రదేశంలో కల్వర్టు ఏర్పాటుకు అనుమతి లభించినప్పటికీ నేటికీ టెండర్లు పిలవకపోవడంతో ఆ ప్రాంత దుకాణదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కౌన్సిల్ ఆమోదించినా..



మూడు రోడ్ల కూడలిలో తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ వద్ద ప్రమాదకరంగా ఉన్న కల్వర్టును ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏడాది క్రితం అప్పటి మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు దృష్టికి తీసుకు వెళ్లగా అంచనాలు తయారు చేయడం, కౌన్సిల్ సైతం ఆమోదించినా నేటి వరకు పనులు ప్రారంభించలేదు.

– నమ్మి శ్రీనివాస్, చిరు వ్యాపారి, సామర్లకోట

ఎవరూ ముందుకు రావడం లేదు



కల్వర్టు నిర్మాణానికి టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రావడం లేదు. ఏదో ఒక కాంట్రాక్టర్‌తో టెండరు వేయించి తోట గోపాలకృష్ణ హైస్కూల్ వద్ద కల్వర్టును నిర్మిస్తాం. మఠం సెంటర్‌లో కల్వర్టు నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం పొందింది. ఎన్నికల కోడ్ వల్ల టెండర్ పిలువ లేదు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం.

– రమేష్, మున్సిపల్ ఏఈ, సామర్లకోట

గ్రావెల్ అక్రమ తవ్వకంపై దాడి

ట్రాక్టర్ సీజ్, ఇద్దరిపై కేసు నమోదు

పిఠాపురం: గ్రావెల్ అక్రమ తవ్వకాలపై పోలీసు, రెవెన్యూ అధికారులు ఆదివారం దాడి చేసి గ్రావెల్‌తో పాటు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో తనకు వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లినట్లు ఆయన తెలిపారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామ శివారు పుష్కర, పోలవరం కాలువ గట్టు వెంట అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిని గుర్తించామన్నారు. వెంటనే గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్‌ను తనిఖీ చేసి ట్రాక్టర్ డ్రైవర్ ద్వారా వివరాలు తెలుసుకుని గ్రావెల్ తవ్వుతున్న ప్రాంతానికి వెళ్లగా అక్కడ మట్టిని జేసీబీతో లోడ్ చేసిన వజ్రకూటానికి చెందిన వాసా రాజు జేసీబీతో సహా పరారయ్యాడన్నారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ కోరుమిల్లి సురేష్‌ను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేసి జేసీబీ డ్రైవరు వాసా రాజుపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

- 15మంది అరెస్టు
- రూ.87 వేల నగదు, నాలుగు బైక్‌ల స్వాధీనం


చదలాడ-పులిమేరు సరిహద్దులో జూదరులను అదుపులోకి తీసుకుంటున్న ఎస్ఐ మౌనిక

పెద్దాపురం: మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న పేకాట స్థావరాలపై స్థానిక పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు చేశారు. ఎస్ఐ మౌనిక ఆధ్వర్యంలో రెండు బృందాలుగా నిర్వహించిన ఈ దాడుల్లో మండలంలోని సీబీ దేవం, జె.తిమ్మాపురం, పులిమేరు, చదలాడ గ్రామాల సరిహద్దు ప్రాంతాలలో జూదమాడుతున్న వారిపై ఉక్కుపాదం మోపారు. ఆయా గ్రామాల స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామని ఎస్ఐ మౌనిక తెలిపారు. ఈ దాడుల్లో 15 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి సుమారు రూ.87,750 నగదు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించనున్నామని ఎస్ఐ తెలిపారు.

23న ప్రభుత్వ పాఠశాల శతాబ్ది వేడుకలు


వేడుక ఏర్పాట్లపై సమావేశమైన పూర్వ విద్యార్థులు

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ హైస్కూల్ శతాబ్ది వేడుకలను విజయవంతం చేయాలని పూర్వ విద్యార్థుల సంఘ కార్యదర్శి కొప్పిరెడ్డి సత్యనారాయణమూర్తి పిలుపు నిచ్చారు. ఈ నెల 23న నిర్వహించనున్న వేడుకలను పురస్కరించుకుని ఆదివారం గ్రంధం రామకృష్ణ కాన్వెంట్ ఆవరణలో పూర్వ విద్యార్థుల సంఘ ముఖ్య నాయకులు ఆయన అధ్యక్షతన సమావేశమయ్యారు. పిఠాపురం రాజా రాజా జగపతి సూర్యారావు బహదూర్ ఆధ్వర్యంలో 1924లో స్థాపించి 2024తో వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. దేశ, విదేశాలల్లో ఉన్న అనేక మంది పూర్వ విద్యార్థులకు మూడు నెల రోజులుగా ఆహ్వానాలు పంపుతున్నామని కొప్పిరెడ్డి వివరించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులను సత్కరించనున్నామని, ఈ మేరకు సుమారు 500 మందిని గుర్తించినట్టు ఆయన తెలిపారు. జూనియర్ కళాశాలలో చదువుకున్న వారు కూడా ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు. 23వ తేది ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే వేడుకలలో అలనాటి గురువులను, వివిధ పదవుల్లో ఉన్న, పదవీ విరమణ చేసిన ప్రముఖులను సైతం సత్కరించనున్నట్టు పూర్వ విద్యార్థి దవులూరి సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు వద్దిపర్తి రాజేశ్వరరావు, కె. పద్మనాభం, బిక్కిన రంగ, యండ్రు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పాతికేళ్ల నాటి ముచ్చట్లు


పనసపాడులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సామర్లకోట: పెద్దాపురం మండలంలోని కాండ్రకోట జెడ్పీ హైస్కూల్ 2000 సంవత్సరం బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పనసపాడులో ఆత్మీయంగా కలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని నిర్మలాదేవి, ఉపాధ్యాయులు వీర్రాజు, రామకృష్ణలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఆనాటి ముచ్చట్లు గుర్తుచేసుకుని వారంతా సందడి చేశారు. సుమారు 50 మంది నాటి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రస్తుతం వారు ఏయే వృత్తుల్లో, ఏయే ఉద్యోగాల్లో ఉన్నదీ వివరాలు పరస్పరం పంచుకుని, కుటుంబాల యోగక్షేమాలు తెలుసుకున్నారు.

భజే భావనారాయణం..

- సర్పవరంలో వైభవంగా తిరునాళ్లు
- మాఘ ఆదివారం పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక అలంకరణలో స్వామి వారు


ఆలయ ప్రాంగణంలో నైవేద్యం కోసం పొంగలి తయారుచేస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో భావనారాయణ స్వామి వారు


స్వామివారి దర్శనానికి వస్తున్న భక్తజనం

కాకినాడ రూరల్: మాఘ మాసం సందర్భంగా సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మూడో ఆదివారం స్వామి వెలసిన రోజు కావడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చి పూజలు చేయించుకున్నారు. స్వామివారిని పూలతో ప్రత్యేక అలంకరణ చేయడంతో భక్తులు చూసి తరించారు. ఇక్కడి భావనారాయణుని దర్శించుకుంటే 108 నారాయణ క్షేత్రాలను దర్శించుకున్నంత ఫలమని పురాణాలు చెప్పుండడంతో పలు ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శించుకుని మాఘ మాస తిరునాళ్లలో పాల్గొంటారు. ఆలయం ప్రాంగణంలో ఉదయం మహిళలు ఆవు పిడకలతో నెచ్చలి వేసి దానిపై ఆవుపాలతో పొంగలి తయారు చేసి సూర్య భగవానుడికి నైవేద్యం సమర్పించి పూజలు చేసుకున్నారు. ఆరోగ్య ప్రదాత సూర్య భగవానుడిని ప్రత్యక్ష నారాయణుడిగా కొలిచి భక్తులు నమస్కారాలు చేసుకున్నారు. వేలాదిగా వచ్చిన భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. వేలాది వచ్చిన భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహించారు. దేవదాయ శాఖ అధ్వర్యంలో పలువురు అధికారులు, సిబ్బంది భక్తులకు ఇబ్బంది లేకుండా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సుమారు 50 వేల మంది భక్తులు హాజరయ్యారన్నారు. సాయంత్రం 6 గంటలకు దర్శనాలు, సేవలు, ప్రసాదం విక్రయం, అన్నదాన విరాళాల రూపంలో సుమారు రూ.5 లక్షలు ఆదాయం లభించిందని తెలిపారు. మూడో ఆదివారం ఆలయానికి వచ్చిన భక్తులకు పంతం నానాజీ, అరుణ దంపతుల సహకారంతో సుమారు 25 వేల మందికి అన్న ప్రసాదం ఉచితంగా అందజేశామన్నారు.

నేటి నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం

కమిషనర్ భావన

బోట్‌క్లబ్: నగరంలో సోమవారం నుంచి ఈ నెల 20 వరకూ పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు నగర పాలకసంస్థ కమిషనర్ భావన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చంపేట ఏడీబీ రోడ్డులో నేషనల్ హైవే అథారిటీ చేపట్టిన పనుల్లో భాగంగా సామర్లకోట నుంచి శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వచ్చే పైపులైన్లకు అనసంధాన ప్రక్రియ చేపడుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. 21వ తేదీ సాయంత్రం నుంచి తాగునీటి సరఫరా యథావిధిగా జరుగుతుందన్నారు. శశికాంత్‌నగర్ నుంచి తాగునీటి సరఫరా జరిగే ప్రాంతాలైన శశికాంత్‌నగర్, శ్రీవిద్యాకాలనీ, భాస్కర్ నగర్, దుమ్ములపేట, సాంబమూర్తి నగర్, గైగోలుపాడు, 1 నుంచి 13 డివిజన్లు, 49, 50 డివిజన్లలో తాగునీటి సరఫరాకు అంతరాయం వస్తుందన్నారు. ప్రజల కోసం ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. తాగునీరు అవసరమైన వారు 98484 71415, 63013 87834 నెంబర్లలో సంప్రదించవచ్చునన్నారు.

ఏడీబీ రహదారి విస్తరణ పనుల పరిశీలన


సీ పోర్టు వద్ద తలెత్తనున్న సాంకేతిక సమస్యలపై చర్చిస్తున్న సురేంద్రనాథ్

కాకినాడ రూరల్: పోర్టు కనెక్టివిటీగా చేపడుతున్న ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను జాతీయ రహదారుల అథారిటీ పీడీ సురేంద్రనాథ్ పరిశీలించారు. ఏడీబీ రోడ్డులో రాక్ సిరామిక్ నుంచి యాంకరేజ్ పోర్టు వరకు సుమారు 26కిలో మీటర్ల మేర నాలుగు లైన్లగా రహదారి విస్తరణ పనులు చేపట్టారు. రెండు ప్యాకేజీల్లో చేపడుతున్న పనుల్లో భాగంగా అచ్చంపేట జంక్షన్ వద్ద గోకుల్ గార్డెన్ నుంచి పోర్టు వరకు రహదారి విస్తరణ పనులు చేస్తున్నారు. ఈ పనుల్లో సూర్యారావుపేట లైట్ హౌస్, సీ పోర్టు వద్ద చేపట్టిన పనులకు సాంకేతిక సమస్యలు ఉండడంతో హైవే అథారిటీ అధికారులతో పాటు పీడీ సురేంద్రనాథ్ పరిశీలించి కాంట్రాక్ట్ సంస్థ ఆర్‌కే కన్‌స్ట్రక్షన్ ప్రతినిధులు సత్య రమేష్ తదితరులతో చర్చించారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం


నృత్యాభినయంతో ఆకట్టుకున్న చిన్నారులు

కాకినాడ రూరల్: స్థానిక బీచ్ రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో హాజరైన సందర్శకులు శిల్పారామాన్ని సందర్శించారు. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా కాకినాడకు చెందిన జగన్మాత నాట్యాలయం పల్లా వీర వెంకట సత్యవతి బృందం పలు నృత్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. చిన్నారులను శిల్పారామం ఇంచార్జి పరిపాలన అధికారి సి.మోహన్‌తేజ అభినందించి సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు


కారు ఢీకొనడంతో బోల్తా పడిన ఆటో

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై మండలంలోని ధర్మవరం సమీపంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. ఉల్లిపాయల లోడుతో ప్రత్తిపాడు నుంచి కత్తిపూడి వైపు వెళ్తున్న ఆటోను ధర్మవరం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన డ్రైవర్ నిలుపుదల చేశాడు. కాగా రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖ వెళ్తున్న కారు నిలిచిఉన్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో బోల్తా పడగా, డ్రైవర్ మొయిళ్ల శివకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని ప్రత్తిపాడు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్‌కు మద్దతుగా ప్రచారం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న హర్షకుమార్ తదితరులు

పెద్దాపురం: రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీగా జీవీ సుందర్‌ను గెలిపించాలని రాజమహేంద్రవరం మాజీ ఎంపీ జీవీ హర్షకుమర్ కోరారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతరంతో మమేకమై సేవా కార్యక్రమాలతో పాటు, పోరాట పటిమ కలిగిన జీవీ సుందరరావును శాసనమండలికి పంపించాలని కోరారు. ఈ ఎన్నికలకు పార్టీ గుర్తు ఉండదని, అయినప్పటికీ కూటమి ప్రభుత్వం అధికార దాహంతో ఈ ఎన్నికల్లో ఓ వ్యక్తిని నిలబెట్టిందన్నారు. వైఎస్సార్ సీపీకి ఉన్న ఇంగిత జ్ఞానం కూడా లేకుండా పార్టీతో కల్గిన ఎన్నికల మాదిరిగా టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి అంటూ ప్రచారం చేసుకుంటోందన్నారు. ఈ ఎన్నికల్లో సుందర్ విజయం తథ్యమని ఆయన అన్నారు. సమావేశంలో సామర్లకోట ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మాజీ కౌన్సిలర్ గుర్రాల యాకోబు, జి.రాగంపేట సర్పంచ్ బుంగా శేఖర్ తదితరులున్నారు.

అదృశ్యమైన బాలిక తల్లిదండ్రుల చెంతకు

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరు గ్రామానికి చెందిన ఇద్దరు పదో తరగతి విద్యార్థినులు ఆదివారం పాఠశాలలో జరిగే ప్రత్యేక తరగతులకు వెళ్లి వస్తామని చెప్పి ఇంటి నుంచి బయలుదేరారు. విద్యార్థినులు పాఠశాలకు రాలేదని స్కూల్ యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు అదృశ్యమైన సంగతి వెలుగు చూసింది. కాగా తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో జగ్గంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగ్గంపేట ఎస్సై రఘునాథరావు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కేవలం గంటలోనే వారి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్సై రఘునాథరావుకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.